

# మా కోసం...

నాకు తెలుసు, మా అబ్బాయి ఇంట్లో పరిస్థితి మాకు వ్యతిరేకంగా ఉంటుందని, అయినా ఆధునిక సమాజంలో ఏ తల్లీతండ్రీ పిల్లలవల్ల సుఖపడటం లేదనేది బహిరంగ రహస్యమే. అందుకే నేనూ శారదా వాడికి దూరంగా ఉండటాన్ని బలవంతంగా అలవాటు చేసుకున్నాం. ఇది మాకు మొదట్లో దుర్భరంగా ఉన్నా, క్రమేపీ అలవాటైపోయింది. కోడలు వచ్చిన కొత్తలోనే మేం విడిగా ఉండటం ఆరంభించటం మూలాన, మా శారదా గుణవంతురాలిగా సంగీత ఉత్తమురాలైన కోడలుగా చలామణీ అవుతున్నారు.

ఉద్యోగ విరమణ తరువాతి రోజుల్లో సాంద్రత పెరిగింది. పొద్దున్నే లేచి కాఫీ తాగటం, పెరట్లో మొక్కలతో కాసేపు ముచ్చటించడం, ఆ పై టిఫిన్ చేయడం.... అంతవరకు బాగానే ఉంది. ఆ తరువాత మొదలవుతుంది సమయంతో సమరం.

గడియారం ముళ్ళని కసిగా చూస్తాను. పేపరు ప్రతి పేజీ తిరగేస్తూ, చూసిన అక్షరాల్నే మళ్ళీ మళ్ళీ కళ్లతో తడుముతాను. అప్పుడప్పుడూ వచ్చే పోయే మనుష్యుల్నీ, పశువుల్నీ 'రే' సినిమా దృశ్యాల్ని చూసినట్లు కిటికీలోంచి చూస్తూ ఫీలవుతాను. తన ఉనికిని తెలియజేస్తూ పెరట్లోని వేపచెట్టు చల్లని గాలినీ, తోడుగా కమ్మని వేపపువ్వు వాసనల్నీ వడ్డించి వెళ్తుంది. నిద్ర రాదు. అదే పనిగా చదువుతున్నప్పుడు రెప్పపాటు కాలం రెప్పల్ని మూసి, అంతలోనే ఉలిక్కిపడేలా చేస్తుంది.

శారద నాకంటే అదృష్టవంతురాలు. వంటపని నెమ్మదిగా సాగదీస్తూ చేసుకుపోతుంది. అప్పుడప్పుడు సమయం ఎక్కువ మిగిలేలా అనిపిస్తే మధ్యాహ్నం భోజనంలో ఓ కూర ఎక్కువ చేస్తుంది. గ్యాస్ అయిపోతే ఆమెకెంత సంతోషమో! కిరోసిన్ స్టవ్‌తోపాటు కూనిరాగాల నేపథ్యం వంటలకలుముతుంది. ఎప్పుడైనా సమయం మరీ మిగిలిందనుకోండి. పాత పాత్రల్ని అటకమీంచి దించి తళతళలాడించే కొత్త కార్యక్రమం చేపడుతుంది.

సెలవులే మాకు ఆట విడుపు. ప్రతి సెలవుల్లో మనవడూ, మనవరాలూ ఇంటికొస్తారు గదా ! ఆ పసివాళ్ల ఆగమనంతో చీకటి అలుముకున్న మా ఇంట్లో కొత్తకాంతులు తళుకులీన్తాయి. అంత వరకూ దీర్ఘరోగంతో బాధపడ్తున్న కాలం గుర్రం, కీలుగుర్రమై పరుగులు తీస్తుంది.

పిల్లలు వచ్చి వెళ్లి అప్పుడే మూణ్ణెల్లు కావస్తోంది. అందుకే ఉండబట్టలేక తొలిసారిగా ఇక్కడికి – కొడుకు దగ్గరికి వచ్చేశాం. పరిస్థితి ఇంత దారుణంగా ఉంటుందని వచ్చాకే గదా తెలిసింది !

కొడుకూ కోడలి ప్రవర్తన ఆధునిక కవిత్వంలా అర్థమయ్యీ కానట్టుంది. సమయానికన్నీ సమకూరుస్తున్నారు. బాగానే స్వాగతించారు. ఆనందం ప్రకటించారు. అందులో సందేహంలేదు. ఎదురైన ఒకటి రెండుసార్లు మొహాలకు నవ్వులద్దుకుంటూనే ఉన్నారు. తీరా చూస్తే మేం ఉన్న స్పృహ లేనట్టు ప్రవర్తిస్తున్నారు.

ఇహ పిల్లల పరిస్థితి చెప్పనక్కరలేదు. వాళ్లకి పరీక్షలట. చదివేది ఐదూ, ఆరూ తరగతులు. ఉదయం ఐదున్నరకి అలారంతో మమ్మీ వాళ్లను నిద్ర లేపుతుంది. బద్ధకం వదిలించుకునేలోపే గోడగడియారంలోని ఉడత ఆరయ్యిందని కిచకిచలు మొదలెడుతుంది. అంతే, కాలం రాక్షసుడు వెంటపడి తరుముతున్నట్టు, ఫార్వర్డ్‌లో వీడియో బొమ్మల్లా అదరాబాదరాగా పనులు ముగించుకొని అయిదు నిముషాల్లో తయారవుతారు. ఫ్రిజ్‌లో దాచివుంచిన శాండ్‌విచ్‌పీసులు, కొన్ని పండ్లు, మరికొన్ని బిస్కెట్లు బాక్సుల్లో కూరుకొని, బైబైల జెండాలూపుతూ వెనక్కి తిరిగి చూడకుండా పరిగెడతారు. అప్పటికే ఫైరింజన్ మోతని తలపిస్తూ అరుస్తుంటుంది ఆటో.

పాలవాడి గోలతో విసుక్కుంటూ బెడ్రూమ్‌తో బలవంతంగా బంధాలు తెంచుకుంటుంది సంగీత. బద్ధకంగా బ్రష్ చేసుకుంటున్నదల్లా మిల్కుకుక్కర్ విజిల్‌తో ఉలిక్కిపడుతుంది. ఆ తరవాత వాషింగ్‌మెషిన్‌లో తిరిగే గుడ్డలా అంతు చిక్కని ఉరుకుల్తో, పరుగుల్తో ఏమేమో చేస్తుంది. గడియారం గుండె చప్పుడు ఎనిమిదిసార్లు వినిపంచగానే "షిట్'" అని అరుస్తుంది. గట్టిగా రొటీన్‌గా. అంతలోనే "ఏవండీ నే వెళ్తున్నా"నంటూ ఎక్కడెక్కడ ఏమున్నాయో లిస్ట్ చదివేస్తుంది. రికార్డెడ్ వాయిస్‌లో రోజూలాగే.

మా సుపుత్రుడు నిద్రలేస్తాడు. రోజులో వాణ్ని చూసే మొదటి క్షణం, చివరి క్షణం అదే. "నాన్నా టిఫిన్ చేశారా ? కాఫీ తాగారా ?" అంటూ రైల్వే స్టేషన్లో అనౌన్స్‌మెంట్‌ని తలపించి, సమాధానం కోసం ఎదురు చూడకుండా వాడి పన్లో వాడు పడిపోతాడు. ఇల్లు వదిలి వెళ్లేటప్పుడు వాడి సౌండ్ మాత్రం వినిపిస్తుంది "అమ్మా ! నేవెళ్తున్నా !" సమాధానం కోసం కాదు, సమాచారం కోసం. ఇక్కడ వినడం తప్ప, అడగటం ఉండదు మరి !

మళ్లీ కాలంతో యుద్ధం. వర్షం వెలిసిన వాతావరణంలో టి.వి.ది ఒక్కటే ఒంటెద్దు పోకడ. ఓపికున్నంతసేపు కునికిపాట్లు పడ్తూ దాన్ని పరామర్శిస్తాం. మధ్య మధ్య శారద అడ్వర్టైజ్‌మెంట్లలాగే ఏవో సంబంధంలేని మాటలు మాట్లాడ్తుంటుంది. అంతలోనే తనకిష్టమైన వంటింటితో కాలక్షేపం చేస్తుంది. కాలంతో అపసోపాలు పడ్తుంటాన్నేను.

ఎండకు వాడిపోయిన గులాబీల్లా ఇంటికొస్తారు, సరయూ సాకేత్‌లు. ఎదురు చూస్తున్న శారద వేడివేడిగా ఏదోఒకటి చేసి పెడ్తుంది. ఆదరాబాదరాగా కట్లలాంటి డ్రెస్సులు విప్పుకొని, కాస్త సౌకర్యవంతమైన అలంకారాలు చేసుకుంటారు వాళ్లు. నానమ్మ చేసి పెట్టిన టిఫిన్ తిని, బోర్నవీటా తాగి "థాంక్స్ నానమ్మా !" అంటూ కమ్మని ముద్దులు పెడ్తారు.

ఆ క్షణం కోసమే ఎదురు చూస్తున్న శారద మొహం కోటికాంతు లీనుతుంది. నా అంతరంగం సంతోషతరంగితమవుతుంది.

అంతలోనే పిల్లలు అచ్చమైన నటుల్లా తమ భావాల్ని మార్చుకొని యాంత్రికత లోకి పరకాయ ప్రవేశం చేస్తారు. మామానాన మమ్మల్నొదిలేసి. స్కేటింగ్ చేస్తున్నట్లే వెళిపోతారు. ఒక జైల్లోనుంచి మరో జైల్లోకి మారే ఖదీల్లా- స్కూల్ నుంచి ట్యూషన్‌కి. అంతసేపూ కళ్లల్లో తచ్చాడుతున్న ఆనందబాష్పాలు వెళ్తున్న పిల్లల్ని బాల్కనీలోనుంచయినా చూడకుండా సైంధవపాత్ర వహిస్తాయి.

ఐదున్నర కావస్తుండగా నిట్టూర్పు సంచీని భుజానికి వేలాడేసుకొని ఇంట్లో కడుగెడుతుంది కోడలు. చల్లని నీళ్లతో మొహం కడుక్కుని సోఫాలో కూర్చోగానే శారద కాఫీ కప్పు అందిస్తుంది.

"మీ కెందుకత్తయ్యా..... శ్రమ...." మొహమాటపడ్తుంది సంగీత. అందులో కృతజ్ఞత కూడా ఉందనేది నిజాయితీగా అంగీకరించకతప్పదు.

సంగీతలో నాకు బాగా నచ్చే గుణమది. ఈ ప్రపంచంలో మనుషులు కనీసం సగమైనా మనఃపూర్వకంగా వ్యవహరిస్తే ఈ సమాజ స్వరూపంలో గణనీయమైన మార్పొస్తుంది.

కాఫీ తాగి రిలాక్స్ కాగానే "అత్తయ్యా రాత్రి భోజనంలోకి ఏం చేయ మంటారు ?" సిన్సియర్‌గా అడుగుతుంది సంగీత.

"నువ్వేమీ చెయ్యనక్కర్లేదమ్మా. ఏం చేయాలో చెప్పు నిమిషాల్లో పూర్తి చేస్తాను. వ్యంగ్యం రంగు ఏమాత్రం అంటకుండా సమాధానం చెబుతుంది శారద, సంగీత అడ్డుపడ్తున్నా పట్టించుకోకుండా.

ఆ తరువాత ఇద్దరూ ఏవో కబుర్లాడుతూ వంట పనిలో నిమగ్నమైపోతారు. సంగీత

పాత్ర నామమాత్రంగా సాగటం ఉభయులకూ ఆనందాన్నిచ్చే అంశం.

సరయూ, సాకేత్‌లు ఏడున్నరకి ఇల్లు చేరుకొని, పుస్తకాల మూటలు దించేసి, దినచర్యలో భాగంగా రొటీన్ సీరియల్ చూస్తూ చదివేందుకుపక్రమిస్తారు. సీరియల్‌లో రాబోయే సీన్‌లను డైలాగులతో సహా చెప్పేస్తూ అడ్వర్టైజ్‌మెంట్లతో శ్రుతి కలుపుతూ....'వంకాయలు జోకటం' మొదలెడతారు. అది గమనించి, శారద గబగబా గోరుముద్దలు తినిపిస్తుంది. నీళ్ళైనా తాగటం మరిచి నిద్రాదేవి కమ్మని ఒడిలో సోలిపోతారు.

ఆ తరువాత నాకు భోజనం పెట్టేసి, అత్తాకోడళ్లు కానిచ్చేస్తారు. ఆ పై ఇంట్లోని ముగ్గురం ప్రాణమున్న జడపదార్థాల్లా టీవీ వైపు చూస్తూ కూర్చుంటాం. ముందుగా నిద్ర గుర్తుకొచ్చేది సంగీతకి. తను లేవటంతోనే మేమూ మంచాన్ని ఆశ్రయిస్తాం, పిల్లల పక్కన సర్దుకుంటాం.

అట్టపెట్టెలాంటి అపార్ట్‌మెంట్‌లో, అగ్గిపెట్టెలాంటి ఆ ఫ్లాట్‌లో జనారణ్యం రణగొణధ్వనుల మధ్య పట్టుకాయల్లోని పురుగుల్లా నిద్రకుపక్రమిస్తాం.

అర్ధరాత్రి మా సుపుత్రుడు పిల్లి శబ్దంలాంటి కాలింగ్‌బెల్ చప్పుడుతో మమ్మల్ని ఉలిక్కిపడేలా చేస్తాడు. మేము పక్కకు తిరిగి పడుకుంటాం.

మొదట శారద విసుగుదల, ఆ తరువాత ముద్దుముద్దుగా అబ్బాయి మాటలు, బాత్రూం గొణుక్కోవటాలు, కిచెన్ చిటపటలు మళ్ళీ మెల్లగా స్తబ్దత తన పెత్తనం గుర్తుకు తెచ్చుకునేదాకా సాగుతాయి. మరుసట్రోజు మళ్లీ మేం చూస్తుండగానే హడావిడిగా తెల్లారుతుంది.

ఇలా..... మా పరిస్థితి పెనం - పొయ్యి సామెతను గుర్తుకుతెస్తుంది. అందుకే ఆదివారంరోజు తిరుగు ప్రయాణానికి అన్నీ సిద్ధం చేసుకున్నాం. అసలు శుక్రవారమే వెళ్లాలనుకున్నాం కాని, అందరికీ చెప్పి వెళ్దామన్న ఏకైక నిర్ణయం ఆదివారందాకా ఆపేసింది.

నేనూహించినట్లే మా కుమారరత్నం ఆలస్యంగా నిద్రలేచాడు. అప్పటికే ట్యూషన్‌కెళ్లిన పిల్లలు తిరిగొచ్చేశారు.

"టిఫిన్ చేశారా నాన్నా..... కాఫీ....." ఎప్పటి పల్లవినే అందుకోబోయాడు తనయుడు.

"ఇంకా చేయలేదురా" వాడు మాట్లాడ్డం పూర్తయితే మళ్లీ కనబడడేమోనన్న భయంతో మధ్యలోనే అందుకున్నాను.

"చేస్తాం చేయగానే బయల్దేరతాం"

"నో తాతయ్యా !" అన్నారు పిల్లలిద్దరూ కోరస్‌గా.

"అదేంటత్తయ్యా సడెన్‌గా....." సంగీత గొంతులో ఆశ్చర్యం.

"..............."

మా వాడి మత్తింకా వదల్లేదు, గొంతు పెగల్లేదు. "వెళ్లాలమ్మా ఇప్పటికే ఆర్రోజులైంది" తప్పదన్నట్టు శారద.

"నానమ్మా వెళ్లొద్దు నానమ్మా" పిల్లలిద్దరూ శారదను చుట్టేశారు. నా కళ్లలో నీళ్లు చిప్పిల్లాయి. శారద పరిస్థితి చెప్పనవసరం లేదు.

"'అత్తయ్యా ! మిమ్మల్నుండిపొమ్మనే అర్హత నాకు లేదు." తలవంచుకొని సోఫా ఆర్మ్‌రెస్ట్ కొనగోట గీస్తూ, మాటల్ని కూడగట్టుకుంటూ చెప్పసాగింది సంగీత.

"కాని ఈ నాలుగైదురోజుల్లో మేమేం కోల్పోతున్నామో మాకు తెలిసొచ్చింది. మొదట్లో మీకు దూరంగా ఉండటమే హాయనిపించినా, మీరు లేనిలోటు, మీరుండటంలోని హాయి ఇప్పుడిప్పుడే తెలుస్తున్నాయి. మీ కోసం కాదు మా కోసం మీరుండాలత్తయ్యా !" శారద చేతులు పట్టుకుంది.

తీయదనంతో కూడా గుండెలు గాయపడ్తాయన్న సంగతి తొలిసారిగా నా అనుభవంలోకొచ్చింది. శారదా నేనూ మొహాలు చూసుకున్నాం.

"మేం మిమ్మల్ని సుఖపెట్టలేకపోయినా, మీరు మా సుఖంకోసం ఆరాటపడుతున్నారు. కన్నతల్లిలాంటి మిమ్మల్ని దూరం చేసుకొని, నేను చాలా పోగొట్టుకన్నాను. ఒక్కసారి పిల్లల మొహాలు చూడండి ...." దుఃఖం, భావోద్వేగం సంగీతనింక మాట్లాడనీయలేదు.

ఒక్కసారిగా వాతావరణం బరువుగా మారింది.

'సంగీతా ! ఈ ఆరు రోజుల్లో నేను చాలా గమనించానమ్మా ! యంత్రాలకంటే అధ్వాన్నంగా మారిన మీ జీవితాలకు చైతన్యం కావాలంటే సహజమైన వాతావరణంలో కొంతకాలమైనా గడపాలి. ఈ పరిస్థితిలో మార్పు రాకుంటే మానవ సంబంధాలు పుర్తిగా అంతరించిపోవడమేగాక, సర్వత్రా అశాంతి తాండవిస్తుంది.' అని చెప్పాలనుకున్నాను కానీ "సరేనమ్మా !" అని మాత్రం అనగలిగాను.

నమ్మలేనట్టు చూశారందరూ.

"హేయ్ !.....నైస్ తాతయ్యా !" ముందుగా తేరుకున్న పిల్లలు నన్ను పట్టుకొని ముద్దెట్టుకున్నారు– ఆనందం పట్టలేక.

"కానీ ఒక్క షరతు !" గంభీరంగా అన్నాను.

కరెంటుపోతే టీవీలో క్రికెట్ మ్యాచ్ ఆగిపోయినట్లు వాతావరణం కామ్‌గా అయిపోయింది.

"మరో పదిహేన్రోజుల్లో పిల్లల పరీక్షలైపోతాయిగా. అప్పుడు పిల్లల్తో పాటు మీరు కూడా మన ఊరికొచ్చేసెయ్యాలి."

ప్రతిసారి పిల్లల్ని పంపి, వీళ్లిక్కడే ఉండటం అలవాటు. "నాకెలా కుదుర్తుంది నాన్నా" గొంతుపెగుల్చుకున్నాడు మావాడు.

"కుదరాలిరా ! కుదరకపోతే కుదుర్చుకోవాలి !" ఆవేశాన్ని అదుపులో పెట్టుకోలేక పోయాన్నేను. "కల్తీ ఆహారం, కల్తీనీరు, కల్తీ గాలితో మీ జీవన విధానమే కల్తీగా మారిపోయింది. అందుకే రకరకాల వింత వ్యాధులతో నలభయ్యేళ్లకే ఎనభయ్యేళ్ల వార్ధక్యంతో బాధపడుతున్నారు. దీన్నుంచి గట్టెక్కాలంటే కనీసం సంవత్సరానికి కొన్నిరోజులైనా సహజమైన గ్రామీణ వాతావరణంలో గడపాలి. మేం మీకోసం మరో పదిహేనురోజులు ఇక్కడుంటాం. మీరు మాకోసమనుకొని ఊరికి రావాలి."

"వస్తాం మామయ్యా !" కొడుకుగారు ఆలోచన నుంచి తేరుకోక ముందే కోడలు మాటిచ్చేసింది.

పిల్లల కేరింతలతో ఇల్లు పులకరించింది. అందరం గుండెలనిండా నవ్వుకున్నాం.

**(21 ఏప్రిల్ 2002, ఆదివారం, ఈనాడు)**